# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రష్యా, ఆస్ట్రియా దేశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల పాటు పర్యటించనున్నారు.
- దేశాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి మురుగన్ అన్నారు.
- రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- ఉపాధ్యాయ అర్హత పరీక్షకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసింది.
- ఉపరితల అవర్తనం ప్రభావంతో రాష్ట్రం లోని పలు జిల్లాలలో తేలిక పాటి నుండి ఓమోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా, ఆస్ట్రియా దేశాలలో మూడు రోజుల పర్యటనకు గానూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఢిల్లీ నుండి బయల్దేరి వెళ్లారు. రష్యా పర్యటనకు బయలుదేరే ముందు ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొంటూ రష్యా, ఆస్ట్రియాలతో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఒక మంచి అవకాశమన్నారు. భారత, రష్యా మధ్య గత పదేళ్లుగా అనేక రంగాలలో వ్యూహాత్మక భాగస్వామ్యం అభివృద్ధి చెందిందని ప్రధానమంత్రి తెలిపారు. కాగా, 22వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సుకు నరేంద్ర మోదీ హాజరు కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ అన్నారు. రాజమహేంద్రవరంలో ఈ రోజు నిర్వహించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వరుసగా మూడవసారి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పేదలకు మూడు కోట్ల ఇళ్ల పథకంపై నరేంద్రమోదీ మొదటి సంతకం చేశారని చెప్పారు. అదే విధంగా రైతుల ఖాతాలకు 20 వేల కోట్ల రూపాయలను జమ చేస్తూ రెండవ సంతకం చేశారని పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సమర్థమైన విధానాల వల్లనే ప్రపంచంలో అయిదవ ఆర్థికశక్తిగా భారత్ ఎదిగిందని తెలిపారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉచిత ఇసుక విధానంపై రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవో నంబర్ 43ను విడుదలచెస్తూ... 2019లో అప్పటి ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానాన్ని రద్దు చేస్తున్నట్లుగా ఈ ఉత్తర్వులో పేర్కొన్నారు. నూతన ఇసుక విధానాన్ని రూప కల్పన చేసేంత వరకూ ఉచిత ఇసుకను రాష్ట్రంలో సరఫరా చేసేలా ఈ ఉత్తర్వుల్లో మార్గదర్శకాలను జారీ చేసింది. ఉచిత ఇసుకను తీసుకునే వినియోగదారుడు చట్టబద్ధమైన పన్నులు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొంది. ఇదిలా ఉండగా ఉచిత ఇసుకను తిరిగి విక్రయించినా, ఇతర రాష్ట్రాలకు తరలించినా కఠిన చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొత్త షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు విడుదల చేసింది. అక్టోబర్ 3 నుంచి 20వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్టుగా ప్రభుత్వం వెల్లడించింది. ఇక అక్టోబర్ 4 నుండి కీ విడుదల చేస్తామని, తుది ఫలితాలను నవంబర్ 2వ తేదిన విడుదల చేస్తామని ప్రకటించింది. రాష్ట్రంలో 16 వేల 347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గాను మెగా డీఎస్సీకి సన్నద్ధమైన ప్రభుత్వం మరోసారి టెట్ పరీక్షని నిర్వహిస్తుంది. ఈ మేరకు ఈ నెల 2వ తేదీ న టెట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు టెట్, డీఎస్సీ పరీక్షలకు సిద్దమవ్వటానికి మరింత గడువును పొడిగిస్తూ పలు మార్పులతో కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపరితల అవర్తనం ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర కోస్తా జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షము లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని, అలాగే కొన్ని చోట్ల భారీ నుండి అతి భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. దక్షిణ కోస్తా రాయలసీమ జిల్లాలలో ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వినాయక చవితి వేడుకల్లో మట్టి గణపతి ప్రతిమలను పూజిస్తే పర్యావరణానికి ప్రయోజనం కలుగుతుందని ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ అన్నారు. మట్టి గణపతికి పూజలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పవన్ కళ్యాణ్ అధికరుల్ని కోరారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో మట్టితో చేసిన వినాయక విగ్రహాలు పూజించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. అదే విధంగా దేవాలయాల్లో ప్రసాదాలను పంపిణీ చేసే కవర్ల స్థానంలో తాటాకు బుట్టలు, ఆకులతో చేసిన దొన్నెలు వాడెలా చూడాలన్నారు. వీటి వినియోగాన్ని పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న ఆలయాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించబోతున్నట్లుగా ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఈరోజు మంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల నుండి ఏజెన్సీ ప్రాంతాల నుంచి అక్రమంగా తరలివస్తున్న గంజాయిని అరికట్టేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా చెక్ పోస్ట్ల వద్ద

పటిష్ఠమైన తనిఖీలు చేయాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చూడాలని తల్లితండ్రులకు, అధ్యాపకులకు మంత్రి సూచించారు.

===========================

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ రోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి వినతులను ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వినతులు స్వీకరించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కలెక్టరేట్ లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్ లోను పొందుపరచాలని ఆయన అధికారులను ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అధికారులను కోరారు. కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ప్రజల సమస్యలను సకాలంలో సానుకూలంగా పరిష్కరించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు.

===========================

రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా కూడా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లాలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమం లో తెనాలి నుండి బెంగుళూరుకు రెండు సూపర్ లగ్జరీ బస్సులు, ఇతర ప్రాంతాలకు మరో నాలుగు బస్సులు ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, యువత ఉద్యోగావకాశాలకోసం బెంగుళూరు వంటి ప్రాంతాలకు వెళ్లటానికి బస్సు సౌకర్యాలను మెరుగుపరచామన్నారు. నెలరోజులోపే బెంగుళూరుకు ఎసి బస్సు కూడా తీసుకువస్తామని మంత్రి స్పష్టం చేశారు.

===========================

సంత్రాగచ్చి నుండి ఈరోజు సాయంత్రం ఆరు గంటలకు బయలుదేరాల్సిన సంత్రాగచ్చి-తాంబరం అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రేపు మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు మార్పు చేసామని వాల్తేర్ డివిజనల్ రైల్వే అధికార వర్గాలు వెల్లడించాయి. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తోన్న కారణంగా ఈ మార్పు చేసినట్లు వెల్లడించాయి.

===========================

అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం లో అధికారులతో ఈ రోజు ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యా మౌలిక సదుపాయాలు, సిసిడిపిలో చేపట్టిన పనులు, గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఏకలవ్య మోడల్ పాఠశాలలు గోకులం షెడ్ల నిర్మాణాలపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.

===========================

రాష్ట్రంలో పూర్తిగా నిర్మాణం కాని హస్టల్, పాఠశాల భవనాలను వినియోగంలోకి తీసుకుని రావాలని బీసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అధికారులను ఆదేశించారు. అమరావతి లోని సచివాలయంలో ఈ రోజు సంబంధిత శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కాగా, ఈ సమావేశంలో గత ఆరు నెలలుగా మెస్ బిల్లులు, హాస్టళ్ల నిర్వహణ ఖర్చులను పెండింగ్ లో పెట్టిన దానిపై చర్చ జరిగిందని అధికారులు తెలిపారు.

===========================

చిత్తూరు పార్లమెంటు పరిధిలో నూతన పరిశ్రమలు రాబోతున్నాయని పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. చిత్తూరులో ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, చిత్తూరులో నిరుద్యోగుల కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

===========================

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =